రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.21, వంకాయ రూ.35, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, క్యాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.50, దొండ రూ40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.50, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.25, మునగ రూ.85, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.40, కీర రూ.23, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.55. ఈ రోజు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రహదారి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఇంద్రప్రస్థ కాలనీలో రూ. 29 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ కాలనీవా సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అభివృద్ధి పనులు సక్రమంగా నిర్వహించేలా జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.బుధవారం నాగోలులో అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగ్ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్య వైశ్య మహిళలు జెడ్పీటీసీ, ఎంపీపీల, ఎంపీటీసీ, సర్పంచులుగా పోటీ చేయాలన్నారు. ఇంటికే పరిమితం కాకుండా వ్యాపారంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పొలిటికల్ చైర్ పర్సన్ గీత గుప్త, ఏపూరీ జయలక్ష్మి, పాల్గొన్నారు.

వికలాంగుల కార్పొరేషన్‌లో ఖాళీలు భర్తీ చేయాలి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమశాఖ కార్పొరేషన్‌లో ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మలకపేటలోని జాతీయ వికలాంగుల పార్కులో ఆయన మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్ర శాఖగా కొనసాగించాలని, 33 జిల్లాల్లో ఏడీ ఆఫీసులు తెరవాలని కోరారు. ఓహెచ్, రోస్టర్ పాయింట్ 10 లోపు మార్చుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. డ్రెస్ కోడ్ ఉద్యోగాలలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. కార్పొరేషన్ ఎండీ శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్య చొరవ చూపి అమలుకు సహకరించాలని కోరారు.

ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కృష్ణానగర్ కాలనీలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ ఆటో సిబ్బంది ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు.



అవేర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో..



మన్సురాబాద్‌లో..



వనస్థలిపురం సచివాలయనగర్‌లో ..

మ్యాన్ హోల్స్..డేంజర్ బెల్స్

అధ్వాన్న స్థితిలో మ్యాన్ హోల్స్ • నిద్రావస్థలో జలమండలి అధికారులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో మ్యాన్‌హోల్స్ నోళ్లు తెరుచుకున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు వర్షాలు దంచి కొడుతుంటే అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉన్నట్లు తెలుస్తోంది. జలమండలి అధికారులు నోళ్లు తెరుచుకున్న మ్యాన్‌హోల్స్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం మ్యాన్‌హోల్స్ నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా మ్యాన్‌హోల్స్ పరిస్థితి దారుణంగా మారాయి. పలు కాలనీల్లో మ్యాన్ హోల్స్‌కు మూతలు లేకుండా ఉన్నాయి. ప్రతి సంవత్సరం మ్యాన్‌హోల్స్ నిర్వహణకు టెండర్లు పిలవడం.. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడం వాటికి తమ వాటాలు తీసుకుని బిల్లులు మంజూరు చేయడం జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. మరి కొన్ని కాలనీల్లో మ్యాన్ హోల్స్‌లు రోడ్డుకు ఎత్తులో మరి కొన్ని కాలనీలో కిందికి ఉండడంతో వాహనదారులకు బాధలు తప్పడంలేదు. మ్యాన్‌హోల్స్‌పై గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నా అధికారులు వాటిపై చర్యలు తీసుకున్న దాఖలాలులేవని తెలుస్తోంది. లింగోజిగూడ డివిజన్ పరిధిలో అవేర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో మూతలు లేకుండా ఉన్న మ్యాన్‌హోల్స్‌కు కర్రల సహాయంతో హెచ్చరికల బోర్డులు పాతారు. ఈ కుంగిన మ్యాన్‌హోల్స్‌కు కనీసం మరమ్మత్తులు కూడా చేయలేదు. వర్షాలు కురిస్తే ఇక్కడ మ్యాన్‌హోల్ కనిపంచక పోవడంతో ప్రమాదలు జరిగే అవకాశం ఉందని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



నాగోలు సాయికాలనీలో..

నాసిరకం పనులు చేయడం వల్లే..



ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం కారణంగానే మ్యాన్‌హోల్స్‌ను మరమ్మతులు చేయకుండ నిర్లక్ష్యం వహిస్తున్నారు. నాసిరకంగా పనులు చేయడం వలన తరుచూ దెబ్బతింటున్నాయి. కమీషన్ల కక్కుర్తికి ఇది నిదర్శనం.అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి – చంద్రశేఖర్‌యాదవ్, హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన కాలనీ కార్యదర్శి)

ఉత్సాహంగా ఆలయ్-బలయ్

మలక్‌పేట: తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సలీంనగర్‌లో దసరా ఆలయ్-బలయ్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కే.లక్ష్మయ్య, ఆల్ ఇండియా స్టేట్స్ పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ డి. సుధాకర్ హాజరైవారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్నటువంటి డిమాండ్లు పరిష్కరించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ చోళ ఓం ప్రకాశ్, హైద్రాబాద్ యూనిట్ అధ్యక్షుడు పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



అలయ్-బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న భరత్‌రెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగహన కల్పిస్తున్న టీటీఐ సిబ్బంది

నాగోలు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఆర్‌ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ సూచించారు. బుధవారం పెద్ద అంబర్‌పేట్, పోచంపల్లి దేశ్‌ముఖి ప్రభుత్వ పాఠశాలల్లో, కొత్తగూడెం, లక్ష్మారెడ్డి పాలెం, భాగ్యలత రోడ్ వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వాహనాలు నడిపే సమయంలో నిబంధనలను మరువరాదని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. చౌరస్తాలల్లో రోడ్డు భద్రత బ్యానర్ ప్రదర్శిసూ నిబంధనలు పాటించాలని వివరించారు.

సబితారెడ్డిని విమర్శించడం సరికాదు

బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

బడంగ్‌పేట్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని విమర్శించే స్థాయి అందెలకు లేదని, ఓడిపోయాననే బాధతో ఏదోదో మాట్లాడుతున్నాడని బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న నాయకులను ప్రశ్నించకుండా.. ప్రతిపక్షంలో ఉన్న సబితారెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ప్రకృతి విలయతాండవానికి ఆదిబట్లలోని సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డు వరకు చెరువు వరదనీరు వచ్చి చేరితే, ఎడతెరపి లేకుండా విస్తృతంగా కురుస్తున్న వరదతోనే అనే విషయాన్ని పక్కన పెట్టి కావాలనే కక్షసాధింపు దిశగా మాట్లాడటం మంచిది కాదని అందెల శ్రీరాములును విమర్శించారు. మళ్లీ అధికారంలోకి వస్తే 100 ఫీట్ల రోడ్డు వేస్తామన్న మాట వాస్తవమే. కానీ అధికారంలోకి రాలేదు కదా అని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదని మండిపట్టారు. ఆలయాలు, మతం తప్పా వేరే మాట మాట్లాడని అందెల ఇప్పుడు కూడా భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. పలుమార్లు సబితా చేతిలో చిత్తుగా ఓడిన ఆయన ఆమెపై కక్షసాధింపు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. సబితారెడ్డిపై విరర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, సుర్జగంటి అర్జున్, ఆనంద్ రెడ్డి, బొర్ర మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..!

- లక్షలాధి రూపాయలతో ఇటీవలే మచిలీకమాన్ మరమ్మతు
- 2 రోజల క్రితం పెచ్చులూడిన పై భాగం
- ఓ వ్యక్తి కాలుకు గాయం

చార్మినార్: గుల్జార్‌హౌజ్‌కు సమీపంలోని మచిలీకమాన్ ప్రమాదకరంగా మారింది. ఇటీవలే లక్షలాధి రూపాయలతో మరమ్మతులు చేపట్టినా.. నాసిరకం పనులతో అవి కాస్తా మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మచిలీకమాన్ పై భాగంలోని సిమెంట్ పెచ్చులూడి అక్కడే కింద ఉన్న ఓ వ్యక్తిపై పడడంతో అతని కాలుకు గాయమైంది. పనులు పూర్తయిన 2 నెలలకే కమాన్ పై భాగంలో పెచ్చులూడడంతో పాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అయినా ఎవరూ పట్టించుకునే వారే లేకపోవడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు.



పెచ్చులూడిన మచిలీకమాన్

నేటి నుంచి బొడ్రాయి స్థాపన ఉత్సవాలు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో నూతన బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం నుంచి ఆదివారం వరకు జరుగుతాయని కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్ దసరా ఉత్సవాల స్థలంలో ప్రతిష్ఠించేందుకు బొడ్రాయిని సిద్ధం చేశామని, గురువారం హయత్‌నగర్ గ్రామ వీధుల్లో ఊరేగింపు ఉంటుందని ఆయన తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన చేస్తామన్నారు.

బీమా పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే



బీమా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: గడ్డిఅన్నారం కురుమ సంఘం అధ్యక్షుడు బైర శంకర్ సంఘ సభ్యులకు సొంత ఖర్చుతో రూ.10 లక్షల పర్సనల్ యాక్సిడెంట్ బీమా చేయించారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కురుమ సంఘ సభ్యులకు ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు సంఘ అధ్యక్షుడు బైరశంకర్‌ను పాల్గొన్నారు.

ముంపు కాలనీలో కార్పొరేటర్ పర్యటన



ముంపు ప్రాంతాలలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ముంపు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని వినూత్ననగర్, అఖిలాండేశ్వరి, స్నేహమయినగర్, కాలనీలో అధికారులతో కలసి పర్యటించారు. ముంపు కాలనీలకు వరద నీరు రాకుండా పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఇంజనీరింగ్ డీఈ దామోదర్‌రావు, వాటర్ వర్క్స్ డీజీఎం రాజగోపాల్,మేనేజర్ భవ్య పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు..ప్రకాశం జిల్లాకు చెందిన నర్సింహ్మా, సుధా(35) దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి సాహెబ్‌నగర్, మారుతినగర్‌లో నివాసముంటున్నారు. నర్సింహ్మా పనిమీద ఇంట్లో నుండి బయటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చూసేసరికి అప్పటికే సుధ మృతి చెందారు. భర్త నర్సింహ్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

వాచ్‌మెన్లతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు

చైతన్యపురి: సెక్యూరిటీ, వాచ్‌మన్‌లకు తక్కువ వేతనాలు ఇస్తూ వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ప్రైవేట్ అపార్టుమెంట్స్ సెక్యూరిటీ అండ్ వాచ్‌మన్ యూనియన్ రంగారెడ్డి జిల్లా మహాసభలు మల్లెపాక వీరయ్య అధ్యక్షతన దిల్‌సుఖ్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. చంద్రమోహన్ మాట్లాడుతూ..సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మన్‌లకు కనీసం రూ. 26వేల జీతం ఇవ్వాలని,అపార్టుమెంటు యాజమాన్యాలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు చంద్రమోహన్

గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడిపై ఫిర్యాదు



నాగోలు: మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ భరత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు.సోషల్ మీడియాలో శ్రీకాంత్ భరత్ మహాత్మా గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు.వైశ్య వికాస వేదిక సభ్యులు సముద్రాల రమేష్, కాచం ఏక్ సాయి, సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్

వనస్థలిపురం: ప్రశాంత్‌నగర్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో శ్రీ కనకదుర్గా దేవాలయం ముందు నుంచి నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలాజీనాథ్, కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, కాలనీ నాయకులు పద్మారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రాకేశ్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలి



బాలాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న వామపక్ష నాయకులు

మీర్‌పేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలాపూర్ మండల వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై రాకేశ్ కిషోర్ అనే వ్యక్తి దాడి చేయడం అప్రజాస్వామిక చర్య అని, ఇది దేశంలోని న్యాయ వ్యవస్థతో పాటు రాజ్యాంగం, యావత్ సమాజంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం కార్యదర్శి ఎం.యాదయ్య, కొల్లూర్ భీమేష్, సీఐటీయూ నాయకులు దాసరి బాబు, జాటోత్ రెడ్యానాయక్, శేఖర్ యాదవ్, యాదమ్మ యాదవ్, ఛత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీతోనే కేంద్రంలో అధికారం

మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం: ఓటు చోరీకి పాల్పడి కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీకి అనుబంధ సంస్థగా పనిచేస్తోందని విమర్శించారు. అనంతరం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఓటు చోరీ తీరును వివరిస్తూ అన్ని ఆధారాలు చూపినా ఈసీ నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఓటు చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, ఏఎంసీ చైర్మన్ కృష్ణా నాయక్, వైస్ చైర్మన్ సీహెచ్.యాదయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, శివగంగ ఆలయ చైర్మన్ కుమార్, ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, బీసీ సెల్ మండల కోఆర్డినేటర్ కుమార్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, అంజయ్య ముదిరాజ్, రాజు, మురళీధర్‌రెడ్డి, రఘుపతి, శివ, హరినాథ్‌గౌడ్, చంద్రమోహన్, రాజేందర్, ప్రసాద్, విఠల్ నాయక్, పాండు నాయక్, బాల్‌రాజ్, పాండు ముదిరాజ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



అమీర్‌పేట్‌లో ఓటు చోరీపై సంతకాల సేకరణలో పాల్గొన్న కేఎల్లార్, తీగల అనితారెడ్డి తదితరులు

'న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

యాకుత్‌పురా: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. పురానీ హవేలిలోని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులోని న్యాయశాఖ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సుబ్బయ్య అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ.. ఈ ఘటన న్యాయ వ్యవస్థ, న్యాయమూర్తుల గౌరవానికి విరుద్ధమైనదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు నరేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆర్. ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు అనిత, కోశాధికారి మనీష్, కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్, కార్యవర్గ సభ్యులు సంధ్య, సుధా, స్వప్న, జయలక్ష్మి, స్నిగ్ధ, ఉమేర సుల్తానా, సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.

కల్వర్టు పనులు పూర్తి అయ్యేదెప్పుడో?



వనస్థలిపురం సుష్మ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ – హయత్‌నగర్ ప్రాంతాలలో విజయవాడ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు మొదలై ఏళ్ళు గడుస్తున్నా పలు చోట్ల కల్వర్టుల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కల్వర్టులపై స్లాబ్‌లు వేయకపోవడంతో వాహనదారులకు ప్రమాదాలు పొంచివున్నాయి. భారీ వర్షాలు వచ్చినప్పుడు వరద ప్రవాహాలతో రోడ్డు, కల్వర్ట్‌లు నీటిలో మునిగిపోతుండడంతో రోడ్డు మార్జిన్ తెలువక వాహనదారులు కల్వర్టులోకి దూసుకెళ్ళే ప్రమాదం ఉంది. గతంలో అలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత జాతీయ రహదారి అధికారులు స్పందించి కల్వర్టులపై త్వరితగతిన స్లాబ్‌ల నిర్మాణం చేయించి వాహనదారులను ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.